క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ



డీఎస్పీ బాలచంద్రారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

టెక్కలి: టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డిని పట్టణానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీగా బాలచంద్రారెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో వార్డు సభ్యులు డి.పోలయ్య, ఎస్.రాజేశ్వరరావు, ఎ.రవికుమార్, టి.లోకేశ్వరరావు, కె.తిరుమలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.అప్పలరెడ్డి, ఎ.రాహుల్, డి.శ్రీనివాస్, డి.రంగబాబు, ప్రసాద్, ఎస్.ప్రశాంత్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సేవలు



మాట్లాడుతున్న దువ్వు కృష్ణారెడ్డి

కవిటి: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా, రాష్ట్ర ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఖరీఫ్ సాగుకు సమాయత్తం కావాలని వ్యవసాయ సలహా మండలి కన్వీనర్ దువ్వు కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం సోమవారం నిర్వహించారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, వరి విత్తనాల పంపిణీ, ఎరువులు తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏవో ఆర్‌ఈసీహెచ్ ప్రసాద్, హెచ్‌వో పోలాకి మాధవీలత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు సాయం



కిడ్నీ బాధితులకు సాయమందిస్తున్న కలాం ఫౌండేషన్ సభ్యులు

కవిటి: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు కిడ్నీ బాధితులకు కలాం ఫౌండేషన్ సభ్యులు రూ.10,000 ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. గేదెల కోదండరావు, సిద్ధాబత్తుల రామస్వామి అనే ఇద్దరు బాధితులకు చెరొక రూ.5000ను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త సంఘాల ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు వీఓఏలు చర్యలు తీసుకోవాలని వెలుగు ఏపీఎం సనపల ప్రసాదరావు సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జగనన్న హౌసింగ్ డేటాను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫిష్ ఆంధ్రా ఫుడ్ ప్రొడక్ట్స్, ప్రోసెస్ ఆక్టివిటీస్ సబ్సిడీ రుణాలు గురించి అర్హులైన సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా రైతుల చేత సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీసీ రామకృష్ణ, మోహనరావు, విష్ణులు పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యం



బోరు ప్రారంభిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా, తాగునీటికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని లొద్దపుట్టి పంచాయతీ సర్పంచ్ ఆశి సులోచనారెడ్డి అన్నారు. పంచాయతీ పరిధిలోని జగన్నాథపురంలో సొంత నిధులతో బోరును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఇంటింటికీ కుళాయి ద్వారా, తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆశి తులసీరెడ్డి, వైస్ సర్పంచ్ పీతంబర్, పి.శ్రీనివాసరెడ్డి, పంది అప్పారావులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం నేడు

పలాస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.



నిర్మానుష్యంగా ఉన్న పాత జాతీయ రహదారి



ఎండ వేడిని తట్టుకోలేక చెట్టునీడకు చేరుకున్న మూగ జీవాలు

తారెత్తిస్తున్న ఎండలు

వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ఎండలు తారెత్తిస్తున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణం మరింత వేడెక్కింది. పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. దీంతో టెక్కలిలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మూగజీవాలు సైతం చెట్టు నీడను ఆశ్రయిస్తున్నాయి. సాయంత్రం సైతం వాతావరణం వేడిగా ఉంటుండడంతో అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

– టెక్కలి

శుభాకాంక్షలు



శాసన మండలికి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీల ప్రమాణస్వీకార కార్యక్రమం మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. దీనిలో భాగంగా శ్రీకాకుళం స్థానిక సంస్థల కోటాలో గెలిపొందిన నర్తు రామారావు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయనను మండలి ప్రాంగణంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు పీఎం తిలక్, కడియాల ప్రకాష్, సోంపేట ఎంపీపీ నిమ్మన దాస్, తడక జోగారావు తదితరులు పాల్గొన్నారు

– కవిటి

ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సత్కరిస్తున్న సర్పంచ్ జానకమ్మ తదితరులు

మందస: ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో విద్యార్థులు అన్నిరంగాల్లో సత్తా చాటుతున్నారని లొహరిబంద సర్పంచ్ రాపాక జానకమ్మ అన్నారు. పాఠశాలలో చదువుతున్న అందాల బాలకృష్ణ, పిన్నింటి పూజిత, సాలీన కరిష్మా, కొర్నాన రాజేంద్ర, బడ్డి జోత్స్నలు నిమ్స్ కాంపిటీషన్‌లో విజయం సాధించారు. దీంతో వీరిని పాఠశాలలో సోమవారం సత్కరించారు. విద్యార్థుల విజయం వెనుక ఉపాధ్యాయుడు గొరకల ఈశ్వరరావు ఉన్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపాక శేషగిరిరావు, పీఎంసీ చైర్మన్ అందాల అప్పారావు, వార్డు మెంబర్ గొరకల పాపారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లి తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'తో గ్రామాలకు మేలు



విశ్రాంతి మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

● ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి

కంచిలి: ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాలకు మేలు జరుగుతోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి జెన్నాగాయి గ్రామంలో రూ.3.5 లక్షలతో మంజూరైన ప్రజా విశ్రాంతి మండపం నిర్మాణ పనులకు సర్పంచ్ గణప సింహాచలం అధ్యక్షతన సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలతో కోనేరు చెరువుకు ఆనుకొని 30 మీటర్ల రిటైనింగ్ వాల్, మరో రూ.1.5లక్షలతో చెరువులో స్నానాలకు అనుగుణంగా సిమెంటు మెట్లు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు బొండాడ వైకుంఠరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, దుర్గాసి ధర్మారావు, ఉప సర్పంచ్ జలసూత్ర కామేష్, కునితి తిరుపతి, గుమ్మిడి చంద్రయ్య, వంకల జయరాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కంచిలి: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాడుపూడి గ్రామ సచివాలయం పరిధి జాడుపూడి కాలనీలో 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ.1.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బోరు, మినీ వాటర్ ట్యాంక్ సిస్టమ్‌లను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పలికల ద్రాక్షాయణి, పార్టీ నాయకులు పలికల జయరాం, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, దుర్గాసి ధర్మారావు, పిలక సోమేశ్వరరావు, జామి నూకయ్య, పిలక కృష్ణారావు, పిలక మోహన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ స్పందనకు 35 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పరిపాలనాధికారి రాజమోహన్

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి బి.రాజమోహన్ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 35 వినతులు వచ్చాయి. టెక్కలి మండలం రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు సుమారు నాలుగు నెలలుగా వేతనాలు అందజేయడం లేదని, అధికారులు స్పందించి జీతాలు అందజేయాలని ఆయా కార్మికులు కోరారు. జయకృష్ణాపురం గ్రామ సమీపంలో శ్మశాన వాటికకు రహదారి వేయాలని, అలాగే గ్రామంలో పంట పొలాలను ముంపు నుంచి కాపాడాలని గ్రామస్తులు విన్నవించారు. సంతబొమ్మాళి కొత్త కాలనీలో మంచినీటి సదుపాయం కల్పించాలని సీహెచ్ జయలక్ష్మితో పాటు మరి కొంతమంది విన్నవించారు. తమ ఇళ్లకు ఆనుకొని వెళ్తున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని తొలుసూరుపల్లి గ్రామానికి చెందిన వై.భుజంగరావుతో పాటు మరి కొంతమంది కోరారు. వీటితో పాటు ఇళ్ల స్థలాలు, హుద్‌హుద్ ఇళ్ల కోసం 28 మంది విన్నవించారు. ఇదిలా ఉండగా స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుకుమార్ రెడ్డి పాల్గొనకపోవడంతో పలువురు అధికారులు డుమ్మా కొట్టారు.

హెల్త్ కమిషనర్‌ను కలిసిన సాయిరాజ్



హెల్త్ కమిషనర్ నివాస్‌తో మాట్లాడుతున్న సాయిరాజ్

సోంపేట: రాష్ట్ర హెల్త్ కమిషనర్ జె.నివాస్‌ను ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ విజయవాడలోని అతని కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సోంపేట సీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మిస్తున్న రెండు కొత్త భవనాల్లో ఒక భవనాన్ని డయాలసిస్ కేంద్రానికి కేటాయించి, ప్రస్తుతం కంటైనర్‌లో నిర్వహిస్తున్న రెండు డయాలసిస్ యూనిట్స్‌తో పాటు అదనంగా మరో రెండు డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయాలని సాయిరాజ్ కోరారు. దీనిపై హెల్త్ కమిషనర్ స్పందిస్తూ సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలిచ్చి డయాలసిస్ కేంద్రానికి నూతన భవనం సత్వరమే కేటాయిస్తామన్నారు. అలాగే అదనంగా మరో రెండు యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చినట్లు సాయిరాజ్ తెలిపారు.

పూర్తి కావస్తున్న గ్రోయిన్ పనులు



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ ఢిల్లీరావు, గోపాలరావులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేశుపురం, బూర్జపాడు పంచాయతీలకు సంబంధించి 12 వందల ఎకరాల ఆయకట్టు రైతుల దిగులు తీరనుంది. జిల్లా కలెక్టర్ నిధులు రూ.28 లక్షలతో నిర్మితమవుతున్న ఈ గ్రోయిన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఖరీఫ్ పంటకు సాగు నీటికి కొదవలేకుండా నీరందుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా కేశుపురం సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, సుగ్గు గోపాలరావులు సోమవారం గ్రోయిన్ పనులను పరిశీలించి, నిధులు వచ్చేందుకు చర్యలు తీసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన పలాస డివిజన్ ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నేర్చుకున్న అంశాలు తరగతి గదిలో అమలు చేయాలని కోర్సు డైరెక్టర్ వై.చిన్నంనాయుడు సూచించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు ఎల్.వెంకటాచలం, ఆర్.రమణమూర్తి, కేవీ రమణ, బీవీ రమణ, సీహెచ్ సంతోష్, వేణు, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'మళ్లీ బీజేపీ ప్రభుత్వమే వస్తుంది'



ధనరాజు

వజ్రపుకొత్తూరు: కేంద్రంలో 2024లో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే వస్తుందని బీజేపీ మత్స్యకార సెల్ అధ్యక్షుడు గుంటు ధనరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తోందని తెలియజేశారు. బీజేపీ హయాంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మందస: ఆర్థిక సాయమందిస్తున్న సొసైటీ ప్రతినిధులు



వజ్రపుకొత్తూరు: ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పుచ్చ పుణ్యావతి వైద్యం కోసం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆర్థిక సాయం చేసింది. సోమవారం పుణ్యావతి ఇంటికి వెళ్లిన సొసైటీ సభ్యులు రూ.10 వేలు అందించారు. పుణ్యావతికి బ్రెయిన్‌లో కణితి ఏర్పడడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెకు రూ.7 లక్షలతో శస్త్ర చికిత్స చేపట్టారు. ఇదికాక ప్రతినెలా వైద్యం కోసం ఖర్చులు అవుతున్నాయి. దీంతో విషయం తెలుసుకొని చేయూతనందించినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రాజు, వాసు, ప్రశాంత్, చంటి, లోలాక్షి, రాహుల్, హరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

మందస: పట్టణంలో ఎస్సీ వీధిలోని కొమ్మన సంతోషి కుటుంబానికి మందస డవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఉండడానికి ఇల్లు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో ఆ కుటుంబాన్ని పలువురు ఆదుకుంటున్నారు. ఇంటి నిర్మాణానికి వస్తు, ధన రూపేన సాయం చేస్తున్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ పట్నాయిక్, ఇప్పిలి కేశవరావు(చిట్టి), కిల్లంశెట్టి సత్యం, గొర్లె దినేష్ తదితరులు పాల్గొన్నారు.


ఉల్లాసంగా వేసవి విజ్ఞాన శిబిరం



ఆటల్లో పాల్గొన్న విద్యార్థులు

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులంతా ఉల్లాసంగా గడుపుతున్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేశారు.

పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని డోకులపాడు గ్రామంలో సర్పంచ్ వడ్డి సరిత ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని కూడళ్లు, రోడ్డు పక్కన, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డి కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి యాదవరాజ్ తదితరులు పర్యవేక్షించారు.

టీడీపీ నాయకుల పాదయాత్ర

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట జంక్షన్ నుంచి పాలేశ్వరస్వామి గుడి వరకు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు లోకేష్ పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా మద్దతుగా పాదయాత్ర చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



సోంపేట: విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



కంచిలి: విద్యార్థి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న హెచ్‌ఎం తిరుపతిరావు

కంచిలి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతోందని చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మడ్డు తిరుపతిరావు అన్నారు. మండలంలోని జలంత్రకోట పంచాయతీ పరిధి చొట్రాయిపురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో ప్రవేశపెట్టిన పథకాలైన జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి తదితర సౌకర్యాలను వివరిస్తున్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కర్రి సుందరరావు, అంగన్‌వాడీ టీచర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని సీహెచ్ గొల్లగండి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం డి.గోవిందరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో విద్యార్థులను చేర్పించడం కోసం డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. గ్రామంలో 13 మంది పిల్లలు చేరడానికి సంసిద్ధత వ్యక్తం చేయగా, అందులో నలుగురు పిల్లలకు ఐదేళ్లు నిండడానికి మరో రెండు నెలలు అవసరం ఉంది. మిగతా పిల్లలకు పాఠశాలలో చేర్పించడానికి అడ్మిషన్ ఫారాలు, అవసరమైన దరఖాస్తులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.దండాసి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.ఈశ్వరరావు, యూత్ లీడర్ ఎం.రామారావు, మత్స్యశాఖ సొసైటీ సభ్యుడు మడ్డు రాజారావు, డీలర్ ఎస్.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

కోటబొమ్మాళి: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలోని హరిశ్చంద్రపురం(బీసీ–ఈ), తిమడాం (బీసీ–ఏ) అంగన్‌వాడీ సహాయకుల నియామకానికి ఈనెల 19లోగా 21–35 మధ్య వయసు గల వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పీవో హైమావతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పూర్తి వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

తక్షణ సాయం అందజేత

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మశాఖపురం గ్రామానికి చెందిన అంబటి మాధవరావు ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగాల జానీరెడ్డి, జి.చిరంజీవి, ఉప్పాడ రాజారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్సార్ బీమా అందజేస్తున్న నాయకులు